స్వర్గీయ శ్రీమతి రాయసము రత్నమ్మగారు

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

ఆవి మేముగుంటూరులో అయిదవాంధ్ర మహిళాసభను జయప్రదముగా జరుపవలెనని పట్టుదలగా కృషిచేస్తున్న రోజులు. "ఏమండీ! మనం ఫలానాచోటికి వెళ్ళితే చాలా ఆలస్యం అవుతుందేమో? బాబుగారు కోపంచేస్తారేమో" నని రాయసము రత్నమ్మగారితో అన్నాం. అందులకు శ్రీరత్నమ్మగారు చిన్న మందహాసంచేసి "మీబాబుగారు యిందుకు గూడా కోపంచేస్తారంటే అది వారికీ మర్యాదగాదు నాకూ మర్యాదగాదు. ఆలస్యమైతే అయింది పోదాంపదండి" అన్నారు. ఆవొక్క వాక్యంలోనూ ఆమె భర్తగారైన రాయసము వెంకటశివుడు పంతులుగారు మహాసంస్కర్తయిన వీరేశలింగం పంతులుగారి ముఖ్య శిష్యులలై యుండటము వారి అనుమతిని వారెన్నో ఇట్టి ప్రజాహిత కార్యాలకు చేయూతఇచ్చి ఉండడమూ, వెంకటశివుడు పంతులుగారు ఆదినుండీ స్త్రీ విద్యాభిమానులై యుండి రత్నమ్మగారిట్టి స్త్రీజనాభ్యుదయ కార్యాలు చేయడానికి ప్రోత్సహించి ఉండడమూ, స్త్రీల నిమిత్తమై వారు జనానా అను ఒక మాసపత్రికను కూడా నడిపి యుండటమూ మొదలైన విషయాలెన్నో నినదించాయి. అయితే పదండి అని మేముగూడ నవ్వుచూ ఆమెగారితోకలిసి మహిళా సభ పనిమీదవెళ్ళాము. పెద్దవారైన రత్నమ్మగార్ని వెంట బెట్టుకునివెళితే ఎక్కడకువెళ్ళినా మాకెంతో అండగాను, నిండుగాను ఉండేది. వారిచ్చే సలహాలుగూడా అమూల్యంగా ఉండేవి.

ఆరోజులలో గుంటూరులో వయోవృద్ధులైన నలుగురు మహిళామతల్లులు ఆపట్టణంలోని మహిళా సంస్థలకేగాక యావదాంధ్ర మహిళా సంస్థలకే అగ్రగణ్యులుగా ఉంటూ ఉండేవారు. ఆవూరిలో ఆనలుగురు నాల్గుసంస్థలను నిర్వహిస్తూ ఉండేవారు. వారిలో మొదటివారు ఏకా రత్నమ్మగారు. ఈమె 'స్త్రీసనాతన ధర్మమండలి' అను స్త్రీసమాజమును స్థాపించి తద్వారా పురాణాలు, భజనలు వేదాంత విచారణలు, ఉపన్యాసాలు పండుగులు, పబ్బాలు సాగిస్తూ ఉండేవారు. అయితే వారికలాపమంతా సనాతనంగా జరుగుతూ ఉండేవి. (ఈమండలి ఈనెలలోనే 40 వ వార్షికోత్సవం జరుపుకున్నది) ఈమండలి పక్షాన ఒక ఎలిమెంటరీ పాఠశాలగూడా ఉండేది. రెండవవారు ఉన్నవ లక్ష్మీబాయమ్మగారు. వీరికృషి జాతీయంగాను, సంస్కరణ భావయుతంగాను ఉండేది. వీరు భర్తగారితో కలిసి వెనుక వితంతు వివాహాది సంస్కరణ కార్యములు నిర్వహించినదే కాక 'శారదానికేతన' మనే గొప్ప స్త్రీ విద్యాపీఠమును స్థాపించి, ఆసంస్థద్వారా జాతీయవిద్యకు ప్రోత్సాహమిస్తూ ఉండేవారు. మూడవవారు రాయసము రత్నమ్మగారు అఖిలభారత మహిళాసంఘమునకు అనుబంధంగా గుంటూరులో శ్రీ కజిన్సుసతి స్థాపించిన మహిళా సంఘమును, వీరు నిర్వహిస్తూ ఉండేవారు. వీరి కార్యక్రమ మంతా అఖిలభారత మహిళా సంఘమువారి నియమావళి ననుసరించీ, సూచనల ననుసరించీ జరుగుతూ ఉండేవి. నాల్గవ వారు బొడ్డుపల్లి బాలాత్రిపుర సుందరమ్మగారు. వీరు మహాలక్ష్మీ పఠనమను గ్రంథాలయమును స్థాపించి స్త్రీలలో గ్రంథ పత్రికాదులను చదివే ఆసక్తి పెంపొందింపచేయడమే కాక యీపఠనమందిరము పక్షమున సంగీత తరగతులు, హిందీ తరగతులు, భజనలు పూజలు, ఉపన్యాసములు, మొదలైనవెన్నో జరుపుతూ ఉండేవారు. ఈవిధంగా ఈ మహిళామతల్లులు నల్వురూ నాల్గుసంస్థలు వేర్వేరుగా నడుపుతున్నా ఏదైనా ఒకమహిళాసభగాని, ఒకమహోత్సవముగాని జరుపవలసివస్తే నలుగురూ ఏకమై జైగీయమానంగా జరుపుతూ ఉండేవారు. అఖిలభారత మహిళాసభ పక్షాన రాష్ట్రసభలు, జిల్లాసభలు, తాలూకాసభలు ఏవిజరుపవలసి వచ్చినా రత్నమ్మగారు వీరినందర్నీ కూడగట్టుకొని గుంటూరులోగాని, తదితరతాలూకా పట్నములలో గాని ఎక్కడజరిగినా తాము హాజరై ఆసభలను చక్కగా జరిపిస్తూ ఉండేవారు.

మహిళోద్యమ మంటే శ్రీరత్నమ్మగారికి ఎనలేని ప్రేమ. మహిళాసభలంటే ఎంతదూరమైనా ఆమెకు భారమనిపించేదికాదు. ఆర్థికంగా స్త్రీలనుభవిస్తున్న దైన్యం ఆమెకెంతో కష్టంగా ఉండేది. సాధారణంగా మహిళా సభల్లో స్త్రీల ఆస్తి హక్కులను గురించే ఆమె ఎక్కువగా మాట్లాడుతూ ఉండేవారు. ఆమె మాట్లాడే ప్రతిమాటలోను ఆస్తిహక్కులు లేనందువల్ల స్త్రీలు అనుభవిస్తున్న కష్టాలను ఆమె ఎంత వేదన పడుతున్నదీ ప్రస్ఫుటమవుతూ ఉండేది. అఖిలభారత మహిళాసంఘము భారత మహిళల సర్వకష్టములను నివారించి సర్వసౌఖ్యములను సమకూర్చే కల్పవృక్షంగా భావిస్తూ ఆసంఘంచేసే ప్రతితీర్మానమును

ఆచరణలో పెట్టడానికి ఆమె దీక్షతో కృషిచేస్తూ ఉండే వారు.

రత్నమ్మగారి భర్తగారైన శ్రీ రాయసము వెంకట శివుడుపంతులుగారు వీరేశలింగం పంతులుగారి ప్రియ శిష్యులు. వీరేశలింగం పంతులుగారి సాహచర్యమువల్ల వెంకట శివుడుగారికి గూడా స్త్రీలు అభ్యుదయము చెందని దేశానికి అభ్యుదయము లేదను విషయము గాఢముగా హృదయమున నాటుకొనిపోయింది. కావుననేవారు స్త్రీల నిమిత్తము 'జనానా' పత్రికను 13 సంవత్సరములు అవిచ్ఛిన్నంగా నడిపారు. స్త్రీలలో విద్య అంతగా వ్యాప్తం లేని రోజులలో వీరేశలింగంపంతులుగారి 'సతీహితబోధిని' పత్రిక, వెంకట శివుడుపంతులుగారి జనానా పత్రిక స్త్రీలల్లో ప్రబోధం కలిగించడానికి అమోఘంగా కృషిచేసినాయి. స్త్రీలు సభలకు వెళ్ళుట అత్యంత ఆక్షేపణీయముగా భావించబడే ఆరోజుల్లో 1857 సంవత్సరం జూన్ నెలలో ఏలూరునందు శ్రీ వీరేశలింగం పంతులుగారి అధ్యక్షతను జరిగిన సంఘసంస్కరణ మహాసభకు శ్రీమతి రాయసము రత్నమ్మగారు వెళ్ళిఉండిరి. ఆమెతో ఆసభకు హాజరైన మరియిద్దరు స్త్రీలలో ఒకరు వీరేశలింగం పంతులుగారి సతీరత్నమైన రాజ్యలక్ష్మమ్మగారు, రెండవవారు సత్తిరాజు కామేశ్వరరావుగారి సతీమణి. లక్ష్మీ సరస్వతీ పార్వతులవలె ఈ ముగ్గురు సోదరీ మణులు ప్రజల ఆక్షేపణలకు జంకక ఆనాడు మహిళోద్యమములో పాల్గొనిన ఫలితముగానే నేడు మహిళోద్యమములో పాల్గొనడమేగాదు మహిళా సభలు జరపడమేగాదు, మహిళా పత్రికలు నడపడమేగాదు మహిళా సంస్థలు నిర్వహించడమేగాదు, ఒకటేమిటి సమస్త మహిళాభ్యుదయ కార్యములను అవలీలగా మనం నిర్వహించే సౌలభ్యం ఏర్పడ్డది.

ప్రజాహిత కార్యములను నిర్వహించు విషయములో, సేకరించబడిన ప్రజాధనము విషయములో రత్నమ్మగారు అత్యంత జాగరూకతగా ఉండేవారు. ఎందరినో అర్థించి, ఎంతో కష్టపడి తెచ్చిన చందా ధనము ఒక పైసయినను వ్యర్థముగా పోవుటకు ఆమె అంగీకరించేవారు కారు. అందులో ఏదైనా లోపం వచ్చిన ఆమె సహించేవారుకారు ఒకనాడు మహిళాసభ రశీదు పుస్తకాలను ఎవరికో యిస్తూ రత్నమ్మగారు "రశీదు పుస్తకాలంటే ఏమనుకున్నారో అవీ డబ్బుతో సమానమైనవే. రశీదైనా ఉండాలి, రశీదు తాలూకు డబ్బైనా ఉండాలి. డబ్బు ఖర్చయి, రశీదు లేక పోతే ఆడబ్బుకు మనమే బాధ్యులం కావలవస్తుంది. చాలా మంది రశీదు పుస్తకాలు అజాగ్రత్తగా చూస్తారు. అది నాకు గిట్టదు. రశీదు పుస్తకం జాగ్రత్త" అన్నారు. వారి హితబోధ నాకెంతో గౌరవాన్ని కలుగజేసింది. గురూపదేశంగా మనస్సుకు హత్తింది. చందావిషయాల్లోనేగాదు సొంత విషయములోగూడ ఆదాయ వ్యయములపట్ల ఆమె కడు జాగరూకతగా ఉండేవారు. అవసరమెంతో అంతే గాని, అనవసరమైన డాబుదర్పాలకు సొమ్ము దూబరా చేయడము ఆమెకు గిట్టదు. ఆమె చాలా నిరాడంబరజీవి. నిరాకరణోద్యమానికి ముందు ఆమె సామాన్యమైన నేత చీరెలు ధరించేవారు. పిమ్మట ఖద్దరు ధరించేవారు. వెంకటశివుడు పంతులుగారు హైస్కూలు మేష్టరుగాను, కాలేజీ లెక్చరరుగాను, వెంకటగిరి రాజావారి (నెల్లూరు) కళాశాలకు ప్రిన్సిపాలుగాను పనిచేశారు. తరువాత ఉద్యోగ విరామమంది విశ్రాంతి తీసుకుంటున్నారు. ఏపరిస్థితుల లోను రత్నమ్మగారు ఒకవిధంగానే ఉన్నారు. పాశ్చాత్య నాగరికత చేతను, అధికార దర్పంచేతను, ఆకర్షితులై క్షణ క్షణానికి స్త్రీలు మారిపోవుచున్న కాలంలో ఆమెలో ఎట్టిమార్పు కనిపించేదిగాదు. ఆమె ప్రయాణాల్లో సూటుకేసు, హోల్డాలు, కాఫీ ఫ్లాస్కులు కనిపించేవికావు. మామూలు గుడ్డల మూటే, మూడవ తరగతి ప్రయాణమే.

అట్లా అని డబ్బు ఖర్చుపెట్టని పిసినారిగాదు. ప్రతి సత్కార్యానికి ఆమె ధర్మము చేస్తూనే ఉండేవారు. ఒక మారు నేనూ, రత్నమ్మగారు కొండా పార్వతీదేవిగారి యింట కలుసుకున్నాము. ప్రస్తావ వశంగా రత్నమ్మగారు "ఆసమాజానికో వందరూపాయలిచ్చాను. ఈ సమాజానికో వందరూపాయలిచ్చాను, ఈ విద్యాపీఠానికి వెయ్యి రూపాయలిస్తానన్నాను. ఆ విద్యా సంస్థ సాగితే దానికీ యివ్వాలననే ఉన్నదంటూ" చెప్పుకువచ్చారు. "అయితే మా మండలికి గూడా ఒక వందరూపాయలివ్వకూడదూ" అన్నాను నేను నవ్వుతూ. "అడిగితే మీకు మాత్రం యివ్వనన్నానా" అన్నారు రత్నమ్మగారు. "అయితే మా మండలి భవన ఆవరణచుట్టూ గోడ కట్టించబోతున్నాము అప్పుడడుగుతా ఉండండి" అన్నాను నేను. "అడగండి" అన్నారు రత్నమ్మగారు. తరువాత కొన్నాళ్ళకు మేము కాంపౌండు గోడను కట్టించబోతూ రత్నమ్మగారికి ఒక ఉత్తరం వ్రాశాను ఆషామాషీగా, నేనడిగినది వారిస్తారో లేదో అనుకుంటూనే. కాని తక్షణమే వచ్చేసింది వారివద్ద

స్వర్గీయ శ్రీమతి రాయసము రత్నమ్మగారు

నుంచి నూరు రూపాయల మనియార్డరు. స్త్రీ సంస్థలపై వారికున్న అభిమానమునకు నాకెంతో ఆశ్చర్యం కలిగించింది.

గుంటూరులో వెంకటశివుడు దంపతులు కట్టించిన శాంతినిలయము అనే మందిరము వారికి స్త్రీ సంస్థలయెడ గల ఆదరాభిమానములకు ఒక చిహ్నమని చెప్పవచ్చును. 'శాంతినిలయమును' వారు కట్టి స్త్రీల ఉపయోగముల నిమిత్తం వినియోగించవలసినదిగా పురపాలక సంఘానికి ఒప్పగించారు. ఆ మందిరంలోనే అఖిలభారత మహిళా సంఘము, మహాలక్ష్మి పఠన మందిరము ఉంటూ ఉన్నవి.

సుమారు ముప్పది సంవత్సరములు పైగా గుంటూరులో నివసించే రత్నమ్మగారు స్త్రీల నిమిత్తమై చేసిన సేవ అంతా విశేషభాగం గుంటూరులోనే చేశారు. వారు కట్టించిన శాంతి నిలయం గూడా గుంటూరులోనే నిర్మించి మహిళోపయోగం నిమిత్తం సమర్పించారు. కనుక గుంటూరు మహిళలు 1949 సంవత్సరంలో రత్నమ్మగారికి సన్మానం జరిపి, వారి ఛాయా చిత్రమును శాంతి నిలయంతో ఆవిష్కరింపచేసి, ఆ ఆవిష్కరించే భాగ్యం నాకు ప్రసాదించారు. కొండా పార్వతీదేవిగారు పంగులూరి రాజ్యలక్ష్మమ్మగారు మున్నగు సోదరీమణులు రత్నమ్మగారు గుంటూరులో స్త్రీల నిమిత్తమై చేసిన పలువిధ సేవలను ఎంతగానో ప్రశంసించారు.

రత్నమ్మగారికిసంతతి లేదు. కానివారెప్పుడు ఒంటరిగా ఉన్నది చూడలేదు. వెంకట శివుడు రత్నమ్మగార్ల యిరు వైపుల బంధువులు వారి యింట యెప్పుడు ఉండేవారు. ముఖ్యముగా ఆడబంధువుల బిడ్డలు ఆడపిల్లలు మొగపిల్లలూ గూడా వారి పోషణలో ఉండి చదువుకుంటూ ఉండేవారు. ఇతర విద్యార్థులకు విద్యార్థినులకుగూడా సహాయం చేస్తూ ఉండేవారు, వారి సహాయంవల్ల చదువుకొని పైకి వచ్చిన వారు వారి బంధువులలోనే కాకుండా ఇతరులలోగూడా చాలామంది ఉన్నారు. ఆమె ఒకసారి మా బాపట్ల వచ్చి నప్పుడు ఒక ఉద్యోగస్థుని యింటికి వెళ్ళి చూచి వచ్చారు. వారిని 'మీరెరుగుదురా' అని నే నడగగా అతను మా యింట్లోనే ఉండి చదువుకున్నాడని ఆమెగారు చెప్పారు

ఇటీవల నేను రాజమండ్రీ వెళ్ళినప్పుడు వారి యింటి వద్ద ఉండగా ఒక బ్రాహ్మణుడు వారి యింటికి వచ్చాడు. ఆయన మాట్లాడి వెళ్ళిన తరువాత ఆయన పురాణం శాస్త్రులుగారని ఆయనకు ఆరువందలుపెట్టి నివాసస్థలం కొని యిచ్చామనీ రత్నమ్మగారు నాతో చెప్పారు. తాము స్థలం కొని యివ్వడమే కాకుండా ఎవరితోనో మాట్లాడి కలప సప్లయి చేయిస్తాననిగూడా రత్నమ్మగారు ఆయనతో చెప్పగా నేను విన్నాను. స్వహస్తముల, పరహస్తముల గూడా రత్నమ్మగారు ఇతరులకు సహాయం చేస్తూ ఉంటారు కాబోలునని నాకు అనిపించింది. ఆ వృద్ధ దంపతులు చేసిన అనేక ధర్మముల వివరాలు మనకు తెలియకపోవచ్చును. కాని వారు అనేకం చేశారనేది స్పష్టమే.

రత్నమ్మగారిలో స్వజాత్యభిమానం అత్యధికం. ఇటీవల వీరు ఒక పిల్లవానిని (వెంకట శివుడుగారి అన్న మనుమనిని) దత్తత చేసుకున్నారట. మద్రాసులో ఉండగా ఆ పిల్లవాడు ఒక తమిళ బాలికను వరించి వివాహమాడ నిశ్చయించుకున్నాడట. ఆ అమ్మాయి గూడా అతనిని ప్రేమించిందిట. బంధువర్గమంతా ఈ వివాహం వల్లగాదన్నారట. కాని రత్నమ్మగారు ఆ పిల్ల మనస్సు నెఱిగి ఆమెను అన్యాయం చేయడం ధర్మం గ దని పట్టుపట్టి వెంకటశివుడుగారికి నచ్చజెప్పి పరస్పరం ప్రేమించుకున్న ఆ యువతీ యువకులకు వివాహం జరిపించారట. రాజమండ్రీలో ఒక మిత్రురాలు నాకీ విషయం చెప్పి రత్నమ్మగారిని ప్రశంసించారు.

రత్నమ్మగారి పుట్టింటి వారిది తూర్పుగోదావరిజిల్లా వెలిచేటివారి ఆడపడుచు. వెంకటశివుడుగారిది పశ్చిమ గోదావరిజిల్లా. రత్నమ్మగారి జననం ఈశ్వర సంవత్సర చైత్రశుద్ధ దశమి. క్రీ॥ 1953 అక్టోబరు 18 వ తేదీని ఆమె స్వర్గస్థులైనారు. చనిపోయేనప్పటికి వారి వయస్సు 74 సంవత్సరాలు. చిరకాలం సంస్కరణోద్యమంలో ఎంత సంబంధం కలిగిఉన్నా రత్నమ్మగారిలో పూర్వాచారపరాయణత్వం పోలేదు. ఆచారవ్యవహారాల్లో, కట్టుబొట్టు సాంప్రదాయాల్లో వ్రతోపవాసాల్లో ఆమె సనాతనంగానే ఉండేవారు. వీరు ఒకప్పుడు నవనాగరికంగా ఉండే వారని విన్నాను. కాని నేను చూచిన ముప్పదేండ్లనుండి ఆమె పూర్వపద్ధతిగానే ఉన్నారు.

ఏవూరిలో ఉండే ఆ వూరిలోనే ఆమె స్త్రీ సంఘసేవ ఏమరక చేస్తూ ఉండేవారు వారు గుంటూరు వదలి రాజమండ్రీలో కాపురం పెట్టిన తర్వాత అచ్చటి స్త్రీలతో

స్వర్గీయ శ్రీమతి రాయసము రత్నమ్మగారు

కలిసి మహిళాసంఘ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండే వారు. గుంటూరులో నేను రత్నమ్మగార్ని కలుసుకొన్నప్పుడు రాజమండ్రీలో ఒక సభను ఏర్పాటుచేస్తాను మీ నిమిత్తంగా మీరు తప్పకుండా రావలెనన్నారు. నా నిమిత్తం సభ యెందుకు, రానంటే వచ్చితీరాలి అన్నారు. ఒకమాటు రమ్మని వ్రాస్తే నాకు వీలుకాదన్నాను. కొన్ని నెలలైన తరువాత మళ్ళీ వ్రాశారు. పెద్దవారి మాట శిరసా వహించి వారు రమ్మన్న ప్రకారం వెళ్లాను. వెళ్ళి చూద్దును గదా అక్కడ సభ ఏర్పాటేలేదు. మళ్ళీ బండి ఎక్కడా మనిపించింది. అయితే రత్నమ్మగారు ఒప్పుకుంటారా, ఉదయమే లేచి ఎక్కడెక్కడికెళ్లారో, ఏవే ఏర్పాట్లు చేశారో ఏమో జరాభారం పైగప్పి, నడుము వంగిపోయి కదలలేకుండా ఉన్న రత్నమ్మగారు అనుకున్న ప్రకారంగా సభను జరిపించారు. వారి సామర్థ్యానికి, కార్యదీక్షకు స్త్రీజనాభ్యుదయ చింతకు నాకు ఆశ్చర్యమైపోయింది. ఆ సభలో ముగ్గురు పిల్లలు కాస్సేపు చక్కగా బుర్రకథ చెప్పారు. ఆ బాలికలకు ఆదుర్తి భాస్కరమ్మగారు ఏవో బహూకరణలు గూడా చేశారు. కాని రత్నమ్మగారు అంతటితో తృప్తిపొందక ఈ బాలికలకు నేను 12 రూ॥లు బహూకరిస్తున్నా నన్నారు. స్త్రీల యెడలను బాలికల యెడల వారికి గల వాత్సల్యాభిమానాలట్టివి.

రత్నమ్మగారికి మొగమాటమన్నది అసలే లేదు. ఎవరి యందైనా ఏదైనా లోపం కనిపిస్తే కుండ బద్దలుకొట్టినట్లు ముఖాన్నే అనేసేవారు. అది కొందఱికి వెగటుగా కనిపించేది. కాని సమకోమలమైన ఆ హృదయంలో ఆ మఱదలింపబడిన వారి శ్రేయస్సు గర్భితమై ఉండేది. అన్యాయంగా, అక్రమంగా అనవసరంగా ఎవరినీ ఏమీ చేయక మంచి ఎక్కడ ఉన్నా గ్రహించే గుణ గ్రహణ పారీణత వారికున్నప్పుడు వారి వాక్పారుష్యం లోపమే గాదు.

రత్నమ్మగారు ప్రత్యేకంగా ఒక సంస్థను స్థాపించక పోయినను, ప్రతి సంస్థకు, ప్రతి సంస్కారానికి, ఆమె యిచ్చిన చేయూత, చేసిన సేవ మరువరానిది, ఆదర్శప్రాయమైనది.

శ్రీ వెంకటశివుడు పంతులుగారు శ్రీవీరేశలింగంపంతులు గారి శిష్యులైనందుకు ఆదినుంచీ స్త్రీ విద్యాభిమానులై తమ జనానా పత్రిక ద్వారా, తమ గ్రంధరచనల ద్వారా చేసిన అమూల్య కృషియేగాక తమ సతీమణియైన రత్నమ్మగారు సంఘసేవ చేయడానికి దాన ధర్మాదులు చేయడానికి సంపూర్ణమైన అవకాశ మొసగి కృతకృత్యులైనారు సంఘసేవ పరాయణియైన శ్రీమతి రత్నమ్మగారు 13-10-53 తేదీని స్వర్గస్థులైనారన్న వార్త ఆంధ్ర మహిళా లోకమునకు తీరని విచారమును కలిగించినమాట వాస్తవము. అయినను నిండు వార్ధక్యముచే లేవలేని పరిస్థితి వచ్చేవఱకు స్వసంఘ సేవ జేసి పుణ్యైదు పసుపు కుంకుముతో భర్త చేతిమీదుగా దాటిపోయిన శ్రీమతి రత్నమ్మగారు ధన్యురాలు. పరమాత్మ వారి ఆత్మకు శాంతి ప్రసాదించుగాక!

"మానవంతులు నీచకార్యములనెప్పుడు చేయరు. నీచులను సేవింపరు. అట్టియవస్థ యందును ధనమునకు లొంగి నీచకృత్యములనాచరింపరు. ప్రతి స్వల్ప విషయమునకైన సంతృప్తినందుదురు. తమ సత్త్వమునకను గుణమగు కార్యము నాచరించుటకు గడగుదురు. మానవంతు లుదాత్తమయిన ప్రకృతిగలవారు. ఎల్లవేళల దాని కనుగుణముగనే ప్రవర్తించెదరు."